నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | శుక్రవారం 16 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పరేడ్ చేస్తున్న సాయుధ బలగాలు

# బాధ్యతాయుతమైన విధులే ముఖ్యం

## కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్ కుమార్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి15: క్రమశిక్షణతో పాటు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్ కుమార్ సూచించారు. జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో 15 రోజుల పాటు సాగిన జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది మొబిలైజేషన్ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా వారి నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. పరేడ్‌కు అడ్మిన్ ఆర్ఐ పెద్దన్న ప్లాటూన్ కమాండర్‌గా వ్యవహరించారు. ఎస్పీ సురేశ్ కుమార్ మాట్లాడుతూ మొబిలైజేషన్ కార్యక్రమం ద్వారా శారీరక ధృడత్వంతో పాటు మానసికోల్లాసం కూడా లభిస్తుందన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, ఎంటీవో ఆర్ఐఅంజన్న, సిబ్బంది పాల్గొన్నారు.

### బదిలీపై వెళ్తున్న వారికి సన్మానం

బదిలీపై వెళ్తున్న ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు, డీఎస్పీ రమేశ్‌తో పాటు పలువురిని ఎస్పీ గురువారం సన్మానించారు. ఉద్యోగంలో బదిలీలు సహజమని, బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. వసుధ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు చేపట్టిన సేవా కార్యక్రమాలను అభినందించారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, టాస్క్‌ఫోర్స్, ఎస్‌బీ సీఐ రాణాప్రతాప్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

# బాధ్యతగా వ్యవహరించాలి

## మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

కలెక్టర్ సంతోష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా క్రీడాయువజన సర్వీసుల శాఖ అధికారి రాజ్‌వీర్



నస్పూర్, ఫిబ్రవరి 15: ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో బదిలీల్లో భాగంగా జిల్లాలో గురువారం బాధ్యతలు స్వీకరించిన పలువురు అధికారులు,ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జవాబుదారీతనంతో వ్యవహరించి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

# చీట్ ఫండ్స్

## మంచిర్యాల జిల్లాలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న సంస్థలు




- నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ
- డబ్బులేమో క్రమం తప్పకుండా వసూలు
- తిరిగిచ్చే విషయంలో నెలల తరబడి జాప్యం

మంచిర్యాల ప్రతినిధి(నమస్తే తెలంగాణ)/ మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 15 : మంచిర్యాల జిల్లాలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన చిట్‌ఫండ్ సంస్థలు జనాలను 'చీట్' చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాయి. రిజిస్టర్డ్ సంస్థలని చెప్పుకుని పెద్ద కార్యాలయాలు తెరుస్తూ, అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పుకుంటు బురిడీ కొట్టిస్తున్నాయి. ఇటీవలే కనకదుర్గ చిట్ ఫండ్ బోర్డు ఎత్తేసింది. దీనిలో డబ్బులు పెట్టిన చాలా మంది రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. ఈ చిట్‌ఫండ్‌లో ఏజెంట్‌గా పని చేసిన చెన్నూర్ వ్యవసాయశాఖ ఏడీఏ భార్య ఫర్టిలైజర్ షాపుల యజమానులతో భారీగా చిట్టీలు కట్టించిన విషయం వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. ఫర్టిలైజర్ షాపుల యజమానులతోపాటు వ్యవసాయశాఖలో పని చేస్తున్న అధికారులతో కూడా చిట్టీలు వేయించి మోసం చేసినట్లు తెలిసింది. ప్రభుత్వ ఉద్యోగులు చాలా మంది కనకదుర్గ చిట్‌ఫండ్‌తోపాటు వివిధ చిట్‌ఫండ్స్‌లో చిట్టీలు వేసి మోసపోయారు. ఇంటి నిర్మాణం, బిడ్డల పెండ్లి, చదువు, ఆపరేషన్ల కోసం అని చిట్టీలు వేసి యాక్షన్ అయ్యాక డబ్బులు ఇవ్వకుండా తప్పించుకుంటున్నట్లు చెప్తున్నారు. ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగుల షూరిటీలు పెట్టించి, ప్రభుత్వ ఉద్యోగులమై ఉండి ఎత్తుకున్న చిట్టీ డబ్బుల కోసం నెలల తరబడి చిట్ ఫండ్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని వాపోతున్నారు. కొన్ని సంస్థల నిర్వాహకులు డబ్బుల కోసం తిప్పించుకుంటుంటే మరికొన్ని సంస్థల నిర్వాహకులు పారిపోతున్నారు.

### స్థానికులే బకరాలు

అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పుకుని సంస్థలో పని చేయడానికి స్థానికంగా మేనేజర్లు, సిబ్బంది, ఏజెంట్లను నియమించుకుని వాళ్లకున్న పరిచయస్తులతో చిట్టీలు వేయించి దందా చేస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఎక్కడి నుంచో వచ్చిన కంపెనీ స్థానికులను బకరాలను చేసి వెళ్లిపోతున్నాయి. సకాలంలో డబ్బులు వసూలు చేస్తున్న సంస్థలు, చిట్టీ యాక్షన్ చేసిన వారికి డబ్బులు ఇచ్చే విషయంలో మాత్రం తీవ్రమైన జాప్యం చేస్తున్నాయి. చిట్స్‌లో సభ్యులుగా చేర్పించిన ఏజెంట్లు స్థానికులు కావడంతో బాధితులు వారిని పట్టుకుని తమకు డబ్బులు ఇప్పించాలని గొడవకు దిగుతున్నారు. చిట్‌ఫండ్స్ పేరిట కార్పొరేట్‌ను తలపించే కార్యాలయాలను తెరిచి చాలా మందిని నమ్మించి చిట్టీలు వేయిస్తున్నారు. అలా వచ్చిన డబ్బులను ఇతర వ్యాపారాల్లోకి మళ్లించడంతో చిట్స్ తీసుకున్న వారికి సకాలంలో డబ్బులు అందడం లేదు. చిట్టీలు వేసిన వారి నుంచి చిట్టీ లేపిన వారి నుంచి డబ్బులు వసూలు క్రమం తప్పకుండా చేస్తున్నారు. లీగల్‌సెల్, రికవరీ సెల్ పేరిట బృందాలుగా వెళ్లి బెదిరించి వసూలు చేస్తున్న సంస్థలు చిట్టీలో మిగిలిన వారికి డబ్బులు ఇవ్వడానికి చుక్కలు చూపిస్తున్నారు. ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగుల ష్యూరిటీలు తీసుకుని నాలుగైదు నెలలు గడిచినా ఇవ్వకుండా.. కొందరు తప్పించుకుంటుంటే, మరికొందరు సంస్థ నష్టాల్లో ఉంది, హెడ్ ఆఫీసుకు వెళ్లాలంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారు. దీంతో ఆయా కార్యాలయాల్లో ప్రతి రోజు గొడవలే దర్శనమిస్తున్నాయి. మధ్యవర్తులు, యాజమాన్యం ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అసహనానికి గురవుతున్నారు. దీంతో రోజు చిట్టీ డబ్బుల కోసం వచ్చి గొడవ చేస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నది. నిబంధనలకు విరుద్ధంగా చిట్స్ నిర్వహిస్తూ అమాయకులను ఇబ్బంది పెడుతున్న యాజమాన్యాల విషయంలో అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మంచిర్యాల జిల్లాలో దాదాపు 15 నుంచి 20కి పైగా చిట్‌ఫండ్ సంస్థలు బోర్డు తిప్పేశాయి. గడిచిన కొన్నేళ్లలో అక్షర, సాయి గీతం, శుభనందిని, అచల, భవ్యశ్రీ, సురభి, చిట్ల, కనకదుర్గ లాంటి చిట్‌ఫండ్ సంస్థలు చేతులు ఎత్తేశాయి. దీంతో లక్షల రూపాయలు రావాల్సిన బాధితులు ఏం చేయాలో తెలియక అవస్థలు పడుతున్నారు.

### అవసరానికి ఉపయోగపడుతాయనుకున్నా..

*మా మరిది వైద్యానికి అవసరం అవుతాయని మంచిర్యాలలోని మహా గణపతి చిట్‌ఫండ్‌లో రూ.10 లక్షల చిట్టీ వేసినా. ముందు మూడు నెలల్లో చిట్టీ ఇస్తామని కమిట్‌మెంట్ ఇచ్చారు. వాయిదాలు పెంచుకుంటూ పోయి ఏడు నెలలకు తీసుకుపోయారు. పోయిన సంవత్సరం అక్టోబర్‌లో చిట్టీ యాక్షన్ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వలేదు. ప్రతి నెలా కట్టే కిస్తీ డబ్బులు మాత్రం వసూలు చేస్తున్నారు. ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగుల ష్యూరిటీ ఇచ్చినప్పటికీ ఐదు నెలల నుంచి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. మధ్యలో ఒకసారి రూ.3.50 లక్షల చెక్ ఇచ్చారు. కానీ.. అది బ్యాంక్‌లో వేద్దామని వెళ్లే ఆ అకౌంట్‌లో డబ్బులు లేవు. ఈ చెక్ వేస్తే బౌన్స్ అవుతుందని బ్యాంక్ వాళ్లు చెప్పారు. ఇప్పుడేం చేయాలే అర్థం కావడం లేదు. ఫోన్ చేస్తే సదరు చిట్‌ఫండ్ నిర్వాహకులు, ఉద్యోగులు ఎవరూ స్పందించడం లేదు.*

**- ఫర్జానా బేగం, డీడబ్ల్యూవో కార్యాలయ ఉద్యోగి.**

### నెలలోపు డబ్బులు ఇవ్వకుంటే ఫిర్యాదు చేయాలి..

*ఏ చిట్టీ వేసినా ష్యూరిటీలు ఇచ్చిన నెల రోజులకు డబ్బులు ఇవ్వాలి. లేని పక్షంలో టీ చిట్స్ యాప్‌లో సిటిజన్ కార్నర్ అనే ఆప్షన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి. అప్పుడు మేము సదరు చిట్‌ఫండ్‌ను డీటైల్ రిపోర్ట్ అడుగుతాం. వారం, పది రోజుల్లో వాళ్లు స్పందించకుంటే జిల్లా రిజిస్ట్రార్ దగ్గర ఆర్బిట్రేషన్ ఫైల్ చేయాలి. లేదా వినియోగదారుల ఫోరంలోనైనా కేసు వేయాలి. ఇది ప్రాసెస్. నెల రోజుల్లో డబ్బులు ఇవ్వకపోతే వెంటనే ఫిర్యాదు చేయాలి. కానీ.. చాలా వరకు చిట్‌ఫండ్ కంపెనీలు కస్టమర్లను నమ్మిస్తున్నాయి. ఆ మాటలు నమ్మి వీళ్లు మోసపోతున్నారు. అంతా అయ్యాక మా దగ్గరికి వస్తే ఏం చేయలేం. నెల రోజుల్లో డబ్బులు రాలేదా.. ఫిర్యాదు చేసుడు ఒక్కటే మార్గం.*

**- రామరాజు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చిట్ రిజిస్ట్రార్**

# 'పది'లో అంతర్గత మార్కులూ కీలకమే

- పాఠశాలల్లో కొనసాగుతున్న పరిశీలన
- 42 ప్రత్యేక బృందాలతో నమోదు
- రేపటిలోగా పూర్తి చేయాలి : డీఈవో



అంతర్గత మార్కులను పరిశీలిస్తున్న బృందం

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 15: పదో తరగతిలో ప్రతి సబ్జెక్టులో మంచి మార్కులు సాధించేందుకు అంతర్గత మార్కులూ కీలకమే. దీనికి సంబంధించి పరిశీలన జిల్లాలో మంగళ వారం ప్రారంభమైంది. పరిశీలన బాధ్యతను ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే హెచ్‌ఎంలకు అప్పగించారు. వీరికి తోడు ఆరు సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. జిల్లాలో 245 పాఠశాలల్లో 9,298 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఈ విద్యార్థుల అంతర్గత మార్కులను వీరు పరిశీలిస్తున్నారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉన్నత పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించిన నాలుగు నిర్మాణాత్మక మూల్యాంకన (ఎఫ్ఏ) పరీక్షల మార్కులను నమోదు చేసిన రికార్డులను పరిశీలిస్తున్నారు. వార్షిక పరీక్షలో ఒక్కో సబ్జెక్టుకు 80, అంతర్గత పరీక్షలకు 20 మార్కులుంటాయి. నాలుగు ఎఫ్ఏల్లో సాధించిన సగటు మార్కుల ఆధారంగా 20 మార్కులకు ఎన్ని మార్కులు వేయాలో నిర్ణయిస్తారు. వీటిని వార్షిక పరీక్షల్లో సాధించే మార్కులకు కలుపుతారు. అందుకే ఈ మార్కులు చాలా కీలకం. ఇందుకోసం బృందంలోని సభ్యులంతా విద్యార్థుల మార్కుల రికార్డులు పరిశీలిస్తున్నారు.

### రేపటిలోగా పూర్తి చేయాలి



పాఠశాలల్లో అంతర్గత మార్కుల పరిశీలన పారదర్శకంగా జరుపాలని ఆదేశాలిచ్చాం. నిబంధనల ప్రకారం 42 బృందాలను ఏర్పాటు చేశాం. వీటి పనితీరును ఎంఈవోలు పర్యవేక్షించాలని కోరాం. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ఈ నెల 17వ తేదీ వరకు పరిశీలన పూర్తి చేయాలి. ఆ వివరాలను ఈ నెల 22 నుంచి సంబంధిత వెబ్‌సైట్(www.bse.telangana.gov.in)లో నమోదు చేయాలి. 29వ తేదీ వరకు పూర్తి చేయాలి.

**- ఎస్ యాదయ్య, డీఈవో, మంచిర్యాల**

# పరాధీనంలో ప్రభుత్వ భూములు

- ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పలువురు రియల్టర్ల మాయ
- అక్రమార్కుల చేతుల్లో వందలాది ఎకరాలు
- సర్కారు స్థలమని బోర్డు పెట్టినా వదలని కబ్జాదారులు
- పర్యవేక్షణ పట్టని అధికార యంత్రాంగం

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూములకు కొదువ లేదు. ఆసిఫాబాద్ కేంద్రంతో పాటు పరిసరాల్లోని సుమారు ఐదు కిలోమీటర్ల వరకు వందలాది ఎకరాల ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. నిజాం సమయంలో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంగా ఉండగా. ఆ తర్వాత ఆదిలాబాద్‌కు మార్చడంతో, ఇక్కడ ఉన్న వందలాది ఎకరాల సర్కారు భూములు క్రమంగా కబ్జాకు గురయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం ఆసిఫాబాద్‌ను మళ్లీ జిల్లాగా ప్రకటించింది.

### సర్వే నంబర్ల వారీగా..

జిల్లా కేంద్రం చుట్టూ 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అన్ని సర్వే నంబర్ల ఆధారంగా రెవెన్యూ రికార్డుల ప్రకారం అధికారులు స్థలాలను 2017లో గుర్తించారు. దీని ప్రకారం అంకుసాపూర్‌లోని సర్వే నంబర్లు 9, 87లలో 403 ఎకరాల్లో గతంలో 64 ఎకరాలను రైతులకు ఇవ్వగా, మిగిలిన 339 ఎకరాలు గిరిజనేతరుల ఆక్రమణలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సాలెగూడ శివారులోని సుమారు 24 రకాల వివిధ సర్వే నంబర్లలో ఉన్న 220 ఎకరాల భూముల్లో 15 ఎకరాలు రైతులకు అసైండ్ చేయగా మిగిలిన 204 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. గోవింద పూర్‌లోని సర్వే నంబర్లు 39, 64 లతో 156 ఎకరాల్లో 94 ఎకరాలు రైతులకు పంచగా, మిగిలిన 61 ఎకరాలు కబ్జాకు గురైంది. మేకలవాడ, కెస్లాపూర్, పిప్పల్‌నవేగాం, ఎల్లారం, ఆసిఫాబాద్, గోడవెల్లి, జన్కాపూర్ ప్రాంతాల్లోని దాదాపు 28 రకాల సర్వే నంబర్లు ఉన్నాయి. ఈ సర్వే నంబర్లలో దాదాపు 1500 ఎకరాల ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. వీటిలో 812 ఎకరాల వరకు రైతులకు వివిధ సందర్భాల్లో అసైండ్ చేశారు. ఇక మిగిలిన 680 ఎకరాల్లో 300 ఎకరాలు అటవీ ప్రాంతం పోను మిగిలిన స్థలాలన్ని ఆక్రమణల్లోనే ఉన్నట్లు అధికారులు నాడు గుర్తించారు. పలు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు వివిధ ప్రభుత్వ శాఖలకు కొన్నింటిని కేటాయించారు. ఇక ఓ చోట ప్రభుత్వ స్థలాన్ని అధికారులు అప్పట్లో సాయుధ పోలీసు దళాల కోసం కేటాయించారు. బోర్డు ఏర్పాటు చేశారు. ఇప్పుడది చెరిగిపోయింది. స్థలం మాత్రం కబ్జా కోరల్లోనే ఉంది. దీనిని కూడా విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ స్థలాలు రియల్టర్లకు కాసులు కురిపిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.



2017లో సాయుధ పోలీసుల దళానికి కేటాయిస్తున్నట్లు ఏర్పాటు చేసిన బోర్డు(ఫైల్)



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ సహదేవరావు

# ప్రత్యేక బృందాలే ఎన్నికల్లో కీలకం

## కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 15: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా వీడియో, స్టాటిక్ సర్వైవ్‌లెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి ఆయా విభాగాల సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే ప్రత్యేక బృందాలు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వీడియో సర్వైవ్‌లెన్స్, స్టాటిక్ సర్వైవ్‌లెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులు, చెక్ పోస్టుల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శిక్షణ నోడల్ అధికారి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# రిజిస్టర్ల ప్రతులు తెచ్చివ్వండి

- కాంట్రాక్టర్‌ను కాపాడేందుకు ఐసీడీఎస్ అధికారుల ఆరాటం
- మూడో రిజిస్టర్ తీసుకురావాలని అంగన్‌వాడీ టీచర్లకు హుకుం జారీ

● నమస్తే ఎఫెక్ట్

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 15: అంగన్‌వాడీలో 'గుడ్లు గుట్కాయ స్వాహా' పేరిట నమస్తే తెలంగాణ దిన పత్రికలో గురువారం కథనం ప్రచురితం కావడంతో ఓ వైపు కాంట్రాక్టర్, మరోవైపు అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. సదరు కాంట్రాక్టర్ ఈ రోజు పత్రికలో ప్రచురితమైన లబ్ధిదారుల వాయిస్‌ల ఆధారంగా ఆ అంగన్‌వాడీ టీచర్లకు ఫోన్ చేసి ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిసింది. మరోవైపు డీడబ్ల్యూవో ఆదేశాల మేరకు మంచిర్యాల ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు మూడో రికార్డు తీసుకురావాలని సీడీపీవోతో పాటు సూపర్‌వైజర్లు ఫోన్లు చేసి ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఒకటో రిజిస్టర్ సర్వే రిజిస్టర్ కాగా, రెండోది ఎఫ్‌సీఆర్‌లో పుడ్ గ్యాప్ రిజిస్టర్, మూడోది పుడ్ బెనిఫిషర్స్ రిజిస్టర్. ఈ రిజిస్టర్‌లో అన్నం, పప్పు, కూరలు, ఇతరత్ర సమాచారంతోపాటు చివరకు గుడ్డు అనే కాలమ్ సైతం ఉంటుంది. లబ్ధిదారులు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి పోషకాహారం తీసుకున్నప్పుడు ఈ అన్ని కాలమ్స్‌లో ఉన్న ఆహారం అందించాలి. కానీ ఈ కాలమ్స్‌లోని ఏదో ఒకటి ఆహారంగా ఇచ్చి సంతకం తీసుకుంటారు. దీంతో ఆ కాలమ్స్‌లో ఉన్న ప్రతిదీ తీసుకున్నట్లు నమోదవుతుంది. ఇక వార్త వచ్చిన వెంటనే అధికారులు ఆ రిజిస్టర్ల జిరాక్స్‌లు తీసుకురావాలని అంగన్‌వాడీ టీచర్లకు హుకుం జారీ చేశారు. కాంట్రాక్టర్‌ను కాపాడడం కోసం ఉన్నతాధికారితోపాటు కింది స్థాయి సిబ్బంది టీచర్లపై ఒత్తిడి తీసుకువచ్చి వెంటనే రిజిస్టర్ కావాలని కోరుతున్నారు. తప్పు చేసిన వారిని కాపాడేందుకు అధికారులు మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారంటూ కొందరు టీచర్లు వాపోతున్నారు. దీనిపై వివరణ కోరేందుకు జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్యను సంప్రదించే ప్రయత్నం చేయగా ఆయన ఫోన్ ఎత్తలేదు.

# ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

- ఓరియంట్ మైనింగ్ లీజు ప్రజాభిప్రాయ సేకరణలో దేవాపూర్ గ్రామస్తులు
- సమావేశాన్ని బహిష్కరించిన గట్రావ్‌పల్లి గ్రామస్తులు

కాసిపేట, ఫిబ్రవరి 15: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తే, మైనింగ్ విస్తరణకు ఎటువంటి అభ్యంతరాలు లేవని దేవాపూర్ గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు. దేవాపూర్ పంచాయతీ ఆవరణలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ మైనింగ్ గని 2 విస్తరణ కోసం తెలంగాణ ఖనిజ అభివృద్ధి సంస్థ లిమిటెడ్(టీఎస్‌ఎండీసీ) ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ హాజరై సమావేశంలో మైనింగ్ విస్తరణకు సంబంధించి 588.26 హైక్టర్ల అటవీ భూమి అవసరం కాగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించామని, అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి వివరాలను పర్యావరణ, టీఎస్‌ఎండీసీ అధికారులు సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా స్థానిక ఆదివాసీలు మాట్లాడుతూ కంపెనీ అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అని ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో హామీలిస్తూ, తర్వాత పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మూడు ప్లాంట్లు ఏర్పాటు చేసిన సమయంలో ఇలాగే హామీలతో కాలం గడిపింది తప్పితే స్థానిక ఆదివాసీలు, నిరుద్యోగులకు చేసిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### బహిష్కరణ, క్వారీలో ఆందోళన

ఓరియంట్ మైనింగ్ లీజుకు సంబంధించి గట్రావ్‌పల్లి, దేవాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో భూములు అవసరం ఉంది. అయితే ఎక్కువ భూమి తమ పరిధిలో ఉందని, గట్రావ్‌పల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించకపోవడంతో, గ్రామస్తులు బహిష్కరించి ఓరియంట్ క్వారీ ఎదుట బైటాయించారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టగా రాత్రి వరకు కొనసాగింది. పర్యావరణ శాఖ ఇంజినీరింగ్ అధికారి లక్ష్మణ్ ప్రసాద్, టీఎస్‌ఎండీసీ, పర్యావరణ శాఖ అధికారులు, ఓరియంట్ కంపెనీ అధికారులు, ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సత్యపాల్‌రావు, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ రవికుమార్, సీఐ దేవయ్య, నాయకులు బొల్లు రమణారెడ్డి, పూస్కూరి వంశీకృష్ణారావు, తిరుపతిరెడ్డి, మడావి అనంతరావు, ఆడె జంగు, రొడ్డ రవికుమార్, దండవేణి చందు, కాసిపేట, దేవాపూర్, రామకృష్ణాపూర్ ఎస్ఐలు గంగారాం, ఆంజనేయులు, రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణను బహిష్కరించి ఓసీసీ క్వారీలో ఆందోళన చేస్తున్న గట్రావ్‌పల్లి గ్రామస్తులు




భక్తులకోసం నిర్మిస్తున్న మరుగుదొడ్లు



సిద్ధమవుతున్న స్నానఘట్టాలు

# జాతరకు సర్వం సిద్ధం

- మంచిర్యాల గోదావరి తీరంలో ఏర్పాట్లు
- భక్తులకు పూర్తి సౌకర్యాల కల్పనపై దృష్టి



సమ్మక్క, సారలమ్మ దేవతల గద్దెల చుట్టూ కొత్తగా నిర్మిస్తున్న సీసీ ప్లాట్‌ఫాం

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 15: మంచిర్యాల గోదావరి తీరంలో ఈనెల 21 నుంచి 24వరకు జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర కోసం ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేయడంలో అధికారయంత్రాంగం నిమగ్నమైంది. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులు తుది దశకు చేరుకున్నాయి. భక్తులు వేచి ఉండేందుకు శాశ్వత షెడ్‌ను నిర్మిస్తున్నారు. దేవతల గద్దెలకు చుట్టూ సిమెంటు కాంక్రీటుతో ప్లాట్‌ఫాంలను వెడల్పుగా నిర్మిస్తున్నారు. స్నానాల కోసం షవర్ బాత్ నల్లాలను ఏర్పాటుచేశారు. మూడు ప్రాంతాల్లో 45 మరుగుదొడ్లను నిర్మిస్తున్నారు. వాహనాల పార్కింగ్, దుకాణాల నిర్వహణ, భక్తులు సేదతీరేందుకు దాదాపు 50 ఎకరాల్లో భూమిని చదును చేయించారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా గౌతమేశ్వర ఆలయం వద్ద, గోదావరి నది ఇసుకలో ట్యాంకర్లను అందుబాటులో ఉంచనున్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మంచిర్యాల పట్టణంలోని ఓవర్‌బ్రిడ్జి నుంచి గోదావరి వరకు విస్తరించి ఉన్న కాలేజీరోడ్‌లో వీధిదీపాలు, గోదావరి నదిలో ఉన్న ఇసుకు కుప్పలను చదునుచేసి, చెత్తాచెదారాన్ని తొలగించి అక్కడ కూడా విద్యుద్దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా పారిశుధ్య కార్మికులను నియమిస్తున్నారు. అవసరమైన మేరకు నిత్యం బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలని నిర్ణయించారు.

### శాశ్వత నిర్మాణాలను చేపడుతున్నాం

**- ఉప్పలయ్య, మున్సిపల్ చైర్మన్, మంచిర్యాల**

భక్తులు, ఇతర అవసరాలకు ఉపయోగపడేలా శాశ్వత నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించాం. ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీటి వసతి, విద్యుద్దీపాలు, స్నానఘట్టాలు, భక్తులకు వసతి ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాం. మరుగుదొడ్లు, వేచి ఉండే గదులు, ప్లాట్‌ఫాంలు, రోడ్లు, పైపులైన్లు, ఇతర అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనులు చేస్తున్నాం. త్వరలోనే పనులు పూర్తి కావస్తున్నాయి.